నాటకాల ప్రదర్శనకు అనువుగా కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

హనుమకొండ, జూన్ 28 : కాళోజీ కళాక్షేత్రం వేదికను నాటకాల ప్రదర్శనకు అనువుగా నిర్మించాలని తెలంగాణ డ్రమటిక్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం అసోసియేషన్ బాధ్యులు మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. కాకతీయుల వైభవాన్ని తెలంగాణ వ్యాప్తంగా చాటేందుకు చర్యలు చేపట్టాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సదానందం, ఉపాధ్యక్షుడు బాలాజీ ఉన్నారు.

మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ డ్రమటిక్ అసోసియేషన్

వృద్ధుడి కాళ్ల పైనుంచి వెళ్లిన బస్సు

హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఘటన

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడి కాళ్లు పోయాయి. మూలమలుపు వద్ద వృద్ధుడి కాళ్ల పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో తీవ్రగాయాలైన ఘటన హనుమకొండ బస్‌స్టేషన్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్‌స్టేషన్ మూల మలుపు నుంచి వృద్ధుడు వెళ్తుండగా లోపలి నుంచి వస్తున్న బస్సు అతడి కాళ్ల పైనుంచి వెళ్లింది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కాగా, డ్రైవర్ల అజాగ్రత్త వల్ల గతంలో బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఓ మహిళా ప్రయాణికురాలి కాళ్ల పైనుంచి, ఇప్పుడు వృద్ధుడి కాళ్ల పైనుంచి బస్సులు వెళ్లడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ రాజు, సొసైటీ డైరెక్టర్ కుమార్

ఒంటిమామిడిపల్లిలో ఎరువుల గోదాం నిర్మించాలి

ఐనవోలు, జూన్ 28 : మండలంలోని ఒంటిమామిడిపల్లిలో ఎరువుల గోదాం నిర్మించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు ఎంపీటీసీ, నందనం సొసైటీ డైరెక్టర్ కడ్దూరి రాజు, గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఒంటిమామిడిపల్లిలో ఎక్కువ శాతం రైతు కుటుంబాలు ఉంటాయని, దానికి అనుగుణంగా గ్రామంలో ఎరువుల గోదాన్ని నందనం సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించాలని కోరినట్లు తెలిపారు. పాత గ్రామ పంచాయతీ ఏరియా, శివనాగన్న ఆలయం వద్ద స్థలం గుర్తించినట్లు తెలిపారు. టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన వారిలో డైరెక్టర్ రాజారపు కుమార్, మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, పెండ్లి మల్లారెడ్డి, గోనె కుమారస్వామి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గిరుక రాజు, మామిండ్ల రంజిత్ ఉన్నారు.

శిశు గృహకు చిన్నారి అప్పగింత

హనుమకొండ, జూన్ 28 : మే నెల 4న దామెర మండలం ఊరుగొండ సమీపంలో గుర్తించిన నవజాత శిశువుకు సుమారు 54రోజులు ఎంజీఎం దవాఖానలో వైద్యం అందించి శుక్రవారం శిశుగృహకు అప్పగించినట్లు జిల్లా సంక్షేమాధికారి మధురిమ తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ వలుపదాసు చంద్రశేఖర్, పీడియాట్రీషన్ హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని శిశుగృహ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు వద్దు అనుకునే తల్లిదండ్రులు నేరుగా తమను సంప్రదించి శిశుగృహకు అప్పగిస్తే చట్టబద్ధమైన దత్తతకు అప్పగిస్తామన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ కేంద్ర దత్తత వనరుల విభాగం నిబంధనల ప్రకారం నవజాత శిశువు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని, ఈ లోగా నవజాత శిశువు తల్లిదండ్రులు, బంధువులు సంబంధిత అధికారులను లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీని సంప్రదిస్తే వారికి అప్పగిస్తామన్నారు. జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్‌కుమార్, శిశు గృహ మేనేజర్ డూడం నగేశ్, శిశు గృహ సోషల్ వర్కర్ సంగి చైతన్య, ఔట్ రీచ్ వర్కర్ విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రజిత పాల్గొన్నారు.

నవజాత శిశువును శిశుగృహకు అప్పగిస్తున్న వైద్యులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE
TS03FD4727 BAJAJ PULSAR 220 SF/ New /2021, TS26H4743 TVS RAIDER 125CC Disc/ New/ 2023, TS 26H2474 TVS XL 100/ New/ 2022, TS24H8434 HONDA SP SHINE/ New/ 2023, TS24G6833 YAMAHA R15 V4/ New/ 2022, TS24H4388 HERO HF Delux/ New/ 2022, TS16UB9678 Ashok Leyland Dost RLS BS IV/ Used/ 2019, TS24TR3190 TVS XL 100/ New/ 2023.
KANAKADURGA FINANCE LTD
Cell: 6302490793

CHANGE OF NAME
I, KALLURI VIJAYA SRI (New Name), previously called KALLURI VIJAYA LAXMI (Old Name), R/o. H.No. 3-118, Raghavareddipet Village, Tekumatla Mandal, Jayashankar Bhupalpally Dist.- 506356, T.S., India. and solemnly declare.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కాంగ్రెస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు

- చోటేభాయ్, బడేభాయ్ కలిసి దేశం, రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు
- దేశ ఇబ్బందులకు మోదీ ప్రభుత్వమే కారణం
- బీఆర్ఎస్‌ను ఖతం చేయడమే కాంగ్రెస్, బీజేపీల లక్ష్యం
- విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

హనుమకొండ, జూన్ 28: కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని జడ్పీ చైర్మన్ మారెపెల్లి సుధీర్‌కుమార్ ఆరోపించారు. ఇందుకు నిదర్శనం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీలు పోటీలో నిలిపిందని డమ్మీ అభ్యర్థులేనని పేర్కొన్నారు. చోటేభాయ్, బడేభాయ్ కలిసి దేశం, రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం సుబేదారిలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిర్మించిన టర్మినల్స్, అండర్‌గ్రౌండ్ టన్నెల్స్, వంతెనలు స్వల్ప సమయంలోనే కూలిపోతుంటే స్పందించని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో జరిగిన చిన్న ఘటనను భూతద్దంలో పెట్టి తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందారని మండిపడ్డారు. ఢిల్లీ విమానాశ్రయంలో టర్మినల్ –1 కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారని, దీనిపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఏం చెబుతారని ప్రశ్నించారు. కనీసం ఆ ప్రాంతాన్ని సందర్శించకపోవడం బాధాకరమన్నారు. ప్రధాని మోదీ ప్రారంభించినవన్నీ అనతి కాలంలోనే కూలిపోతున్నాయన్నారు. మేడిగడ్డ ఒక పిల్లరు దెబ్బతినగా, మరో రెండు పిల్లర్లపై ప్రభావం పడిందన్నారు. వీటిని సాకుగా చూపి మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా తెలంగాణ రైతాంగానికి నష్టం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముంబైలో అటల్ సేతు అండర్ టన్నెల్ కూలిపోగా, బీహార్‌లో మరో రెండు వంతెనలు వరుసగా కూలాయని, చివరకు అయోధ్యలోని రామమందిరం గర్భ గుడిలో సైతం లీకేజీ ఏర్పడి నీరు కురుస్తున్నదన్నారు. పది సంవత్సరాల్లో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి దేశానికి దిక్సూచిగా మార్చిన బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని కాంగ్రెస్, బీజేపీలు కంకణం కట్టుకున్నాయన్నారు. దేశంలో జరుగుతున్న విధ్వంసాలకు బీజేపీ, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులకు కాంగ్రెస్ బాధ్యత వహించాలన్నారు. దేశంలో సుఖశాంతులు లేవని, జీవన స్థితిగతులు మెరుగుపడలేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటాయని, ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మోసపూరిత, అమలు చేయలేని 13 అంశాలతో కూడిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలి ప్రభుత్వం ఉంటుందా లేదా? ఎలా కాపాడుకోవాలనే ఆలోచనలో ఉన్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో భీమదేవరపల్లి జడ్పీటీసీ వంగ రవి, మాజీ ఎంపీపీ సంగం సంపత్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సిటీగా హనుమకొండ

క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్

జేఎన్ఎస్‌లో క్రీడాశాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : స్వల్ప వ్యవధిలోనే గణనీయమైన ప్రగతిని సాధిస్తూ హనుమకొండ స్పోర్ట్స్ సిటీగా మారుతోందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు, యువజన పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆమె హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జరుగుతున్న అభివృద్ధితో పాటు క్రీడా పాఠశాల ఎంపికలను పర్యవేక్షించారు. తొలుత సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను పరిశీలించారు. కుడా ఆధ్వర్యంలో గ్రాస్ నిర్మాణంతో పాటు కార్పొరేషన్ సహకారంతో ట్రాక్ మధ్యలో నూతనంగా రెజ్లింగ్ హాల్ నిర్మిస్తుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. కొత్త భవన నిర్మాణం ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని డీవైఎస్‌వో అశోక్ ఆమెను కోరారు. అప్పటి కమిషనర్, ప్రస్తుత హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం జెండా ఊపి 800 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. మెరుగైన ప్రతిభ కనబరిచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడా పాఠశాలలకు ఎంపిక కావాలన్నారు. అనంతరం బస్‌స్టేషన్ సమీపంలోని యువజన శాఖ నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. కంప్యూటర్, టైలరింగ్ శిక్షణార్థులతో మాట్లాడారు. స్వల్ప వ్యవధిలోనే విశేష అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్ మహ్మద్ నయీం, జిల్లా ఒలింపిక్, ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు కైలాసం యాదవ్, తోట శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీలో 93.93 శాతం ఉత్తీర్ణత

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 593 మంది పరీక్ష రాయగా 557(93.93) మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మహ్మద్ అబ్దుల్ హై తెలిపారు.

కేయూ లైబ్రరీలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : కేయూ కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను రిజిస్ట్రార్ మల్లారెడ్డి ప్రారంభించారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి, పొన్నాల రామయ్య, నరసింహారావు, రవిశంకర్, జితేందర్, గ్రంథాలయ అధికారులు ఇజాక్ ప్రభాకర్, తేజావత్ జావేర్ పాల్గొన్నారు.

దూరవిద్య సైన్స్ కోర్సుల ఫీజు గడువు జూలై 15

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జూలై 15 వరకు కోర్సు ఫీజు చెల్లించాలని కేంద్రం సంచాలకులు వల్లూరి రామచంద్రం, సహాయ సంచాలకులు బట్టి వెంకటగోపీనాథ్ తెలిపారు. త్వరలో ద్వితీయ సంవత్సరం తరగతులు మొదలుకానున్న దృష్ట్యా విద్యార్థులు పరీక్ష సహా సంవత్సరం ఫీజు చెల్లించాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కాజీపేట, జూన్ 28 : పట్టణంలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కందుగుల సంఘమయ్య తెలిపారు. నగరానికి చెందిన శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. సెక్రటరీ కేవీ రావు, కోశాధికారి ఐలయ్య, దవాఖాన ఇన్‌చార్జి మల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు తీర్చే కొత్త ఒరవడికి శ్రీకారం

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, జూన్ 28 : ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తీర్చేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్‌లో సీఎండీ ఫ్లూయెంట్ గ్రిడ్ కంపెనీ యుటిలిటీ ఆపరేషన్ సెంటర్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిస్కంకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసే డాష్‌బోర్డు అప్లికేషన్‌ను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని సీఎండీ తెలిపారు. దీని ద్వారా సమగ్ర వివరాలు తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. బిల్లింగ్, కనెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ మాదిరిగా ఒకటే చోట ప్రతి సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుందని వివరించారు. తద్వారా వారి సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ఇది వినియోగదారులకు ఎంతగానో దోహదపడుతుందని, మరింత నాణ్యమైన విద్యుత్ సరాఫరా అందించేందుకు వీలవుతుందని చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ముందుంటామని తెలిపారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కేఎన్ గుట్ట అన్నపూర్ణ, శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పత్తిపాకలో పద్మశాలి కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట జూన్ 28 : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. పత్తిపాకలో పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, పత్తిపాక శివారులో వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరగా, సంబంధిత అధికారులను ఎస్టిమేట్స్ తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం శాయంపేట బస్టాండ్ సెంటర్లో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పీవీ పునాదులు వేశారని గుర్తుచేశారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నవోదయ పాఠశాలలను ప్రారంభించి, జైళ్ల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓపెన్ జైల్ అనే పద్ధతికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చల్లా చక్రపాణి, పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి, దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, కృష్ణమూర్తి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, కొమ్ముల భాస్కర్, పత్తి శీను ఉన్నారు.

'జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సీఎంతో ప్రకటన చేయిస్తాం'

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంపై ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజును సిక్స్‌మెన్ కలిసింది. రెండు జర్నలిస్టు సొసైటీల జాగలు క్లియర్ చేయటంతోపాటు ఏ సొసైటీలో లేని వర్కింగ్ జర్నలిస్టుల కోసం అనువైన స్థలం కేటాయించాలని కమిటీ సభ్యులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో స్పష్టమైన ప్రకటన చేయిస్తామని హామీ ఇచ్చినట్లు, భూకేటాయింపులకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేయిస్తామని చెప్పారు. సిక్స్‌మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్ లెనిన్, కో–కన్వీనర్లు వేముల నాగరాజు, బొక్క దయాసాగర్, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, బొల్లారం సదయ్య ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : వరంగల్–1 డిపో ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని, ఈ రూట్లలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9866373825లో సంప్రదించాలని కోరారు.

రేపు జేఎన్ఎస్‌లో కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : వరంగల్, హనుమకొండ జిల్లాల అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో కిడ్స్ ఈవెంట్ 8, 10, 12 సంవత్సరాల పిల్లలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. జూలై 7న గచ్చిబౌలి గోపీచంద్ అకాడమీలో జరిగే తెలంగాణ స్టేట్ కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ప్రతి జిల్లా నుంచి 15 మంది అథ్లెట్ల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8 సంవత్సరాల వారికి 50, 300 స్టాండింగ్ జంప్, 10 ఇయర్స్ వారికి 100, 300 లాంగ్‌జంప్, 12 ఇయర్స్ వారికి 100, 400, 600 లాంగ్‌జంప్‌తో పాటు ఆల్ ఈవెంట్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని, ఇతర వివరాలకు 9390104499 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు ప్రత్యేక మహాజన సభ

ఆత్మకూరు, జూన్ 28 : ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10గంటలకు ప్రత్యేక మహాజన సభ ఏర్పాటు చేయనున్నట్లు సహకార సంఘం సీఈవో పొరెడ్డి ఓం ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో రైతు బంధు పథకం అమలుపై సభ్యుల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ

ఆత్మకూరు, జూన్ 28 : అక్కంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లెబోయిన రవియాదవ్ తల్లి కేతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆకుటుంబాన్ని పరామర్శించారు. కేతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వరంగల్, జూన్ 28 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే నినాదంతో మొక్కలు నాటే ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, తాళ్లపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

మడికొండ, జూన్ 28: నగరంలో64వ డివిజన్ మడికొండ టీఎన్జీవోస్ కాలనీలోని శ్రీసాయి ఆర్చిడ్ కాలనీలో డ్రెయినేజీ కాల్వ నిర్మించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. డ్రెయినేజీ కాల్వ లేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని, పిల్లలు స్కూల్‌కు వెళ్లేప్పుడు జారి పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బరిగల బాబు, కార్యదర్శి కోకిల, రూప, ఠాగూర్, ఇల్లందుల సుమన్, దామెర అరుణ్ పాల్గొన్నారు.

రాజధాని బస్సు చార్జీతో గరుడ ప్లస్ సేవలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సు చార్జీలతో గరుడ ప్లస్ సేవలను జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రయాణికులు వినియోగించుకోవచ్చని ఆర్ఎం విజయభాను తెలిపారు. రూ.370 చార్జీతో గరుడ ప్లస్ బస్సులో ప్రయాణించొచ్చని, ప్రయాణికులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

మాట్లాడుతున్న మహేందర్

వేలేరు, జూన్ 28 : పీచరలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ మండల యువజన నాయకులు, పీచర సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ కొయ్యడ మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీచర సమ్మక్క–సారలమ్మ ఆలయ పరిధిలోని ఉన్న ప్రభుత్వ భూములలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నాడని, వారి నుంచి ఆ భూములను కాపాడాలని కోరారు. గ్రామంలోని 453, 514 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. దీనిపై స్థానిక తహసీల్దార్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు మహేందర్ తెలిపారు.

వనమాల కనపర్తిలో జడ్పీ సీఈవో పర్యటన

ఐనవోలు, జూన్ 28 : మండలంలోని వనమాల కనపర్తిని జడ్పీ సీఈవో విద్యాలత శుక్రవారం పర్యటించారు. పారిశుధ్య పనులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నర్సరీ, అంగన్‌వాడీ సెంటర్‌ను ని తనిఖీ చేశారు. పులి వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ జనుగాని అశోక్ ఉన్నారు.

దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్
- నర్సింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ/హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ నర్సింహారావు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో కలిసి పీవీ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ అని, ఆయనకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సముచిత గౌరవం కల్పించారన్నారు. పీవీ శత జయంతిని సైతం అధికారికంగా నిర్వహించారని గుర్తుచేశారు. దేశ ప్రధానిగా సేవ చేశారని, ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజక వర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, పరశురాములు, రఘు, కార్పొరేటర్లు చెన్నం మధు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మైనార్టీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్, పులి రజినీకాంత్, బీఆర్ఎస్వీ నాయకులు కంజర్ల మనోజ్‌కుమార్, బైరపాక ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్–1 కాలనీలో పీవీ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మొట్ల మనోహర్, కుమార్‌రెడ్డి, మాధారపు ఉదయ్ కిరణ్, రాజ్‌కుమార్, వెంకటేశ్, చిర్ర శ్రవణ్, అజయ్, రాజు, రమేశ్, పాల్గొన్నారు.

ప్రముఖుల నివాళి..

హనుకొండ బస్‌స్టేషన్ కూడలిలోని పీవీ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, తెలంగాణ అర్చక సమాఖ్య గౌరవాధ్యక్షుడు, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేయూ పీవీ విజ్ఞాన కేంద్రం సంచాలకులు కిష్టయ్య ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో పీవీ చిత్రపటానికి రిజిస్ట్రార్ మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి, విభాగాధిపతులు రమ, భారవిశర్మ, సంకినేని వెంకట్, సోమయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, రమేశ్, సైదా, మమత, వంగాల సుధాకర్, బుర్రా సృజన పాల్గొన్నారు.

పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

ఎల్కతుర్తి/హసన్‌పర్తి : మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీసం సురేందర్‌రెడ్డి, అరెల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, కలెక్టర్